
**సర్కారు బడికి అడ్రస్ ఏదీ..!**




**చోరీ కేసులో నిందితుడి అరెస్ట్**


AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## అర్గుల్‌లో వందశాతం డిజిటలైజేషన్ పూర్తి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** అర్గుల్ గ్రామంలో వందశాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తయిందని సర్పంచ్ సాయన్న తెలిపారు. ఈ సందర్భంగా శనివారం తహశీల్దార్ కిరణ్మయి, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కార్యక్రమన్ని విజయవంతం చేసిన బీఎల్‌వోలకు, సూపర్‌వైజర్ ప్రసాద్, జీపీవో, కార్యదర్శి తదితరులను అభినందించి సన్మానించారు.



**కబ్జారాయుళ్లు బరితెగిస్తున్నారు.. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు పాగా వేసేస్తున్నారు.. నకిలీ పత్రాలను సృష్టించి ఇతరుల స్థలాలను కబ్జా చేస్తున్నారు. తాజాగా నిజామాబాద్ నగరంలో వెలుగు చూసిన పలు ఘటనలే ఇందుకు నిదర్శనం. కబ్జాలకు పాల్పడుతున్న వారిలో డాక్యుమెంట్ రైటర్ల హస్త ఉండడం.. వారికి సబ్ రిజిస్ట్రార్లు సైతం సహకరిస్తుండడం ఆందోళన కలిగించే విషయం.**

**- అక్షరటుడే, నిజామాబాద్**



# అక్రమార్కులకు అండదండలు..!

**▸ కబ్జారాయుళ్లకు సహకరిస్తున్న సబ్‌రిజిస్ట్రార్లు ▸ యథేచ్ఛగా అక్రమ రిజిస్ట్రేషన్లు**

నిజామాబాద్ నగరంలో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తాజాగా కొందరు వ్యక్తులు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 50 గజాల స్థలాన్ని కాజేసేందుకు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించారు. అయితే బాధితురాలు మూడో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

### దొరికింది కొందరే..

తాజాగా నకిలీ సర్టిఫికెట్లతో దొరికిపోయిన వారే కాదు.. ఇలా జిల్లాలో చాలా మంది నకిలీ పత్రాలతో స్థలాలు కాజేస్తున్నారు. అధికారుల సహకారంతో డబుల్ రిజిస్ట్రేషన్లు చేయిస్తూ స్థలాలను రాత్రిరాత్రే తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. డాక్యుమెంట్ రైటర్లు, రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది సహకారం ఉండడంతోనే ఫేక్ డాక్యుమెంట్లు పుట్టుకొస్తున్నాయని తెలుస్తోంది.

### సెలవులో అధికారి..

నగరంలోని మూడో టౌన్ పరిధిలోని అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం వెలుగులోకి రాగా.. ఈ విషయమై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నకిలీ పత్రాలు సృష్టించిన ముఠాకు సహకరించిన వారి కూపీ లాగుతున్నారు. కాగా.. ఇదే సమయంలో నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ అధికారి సెలవులో వెళ్లడం చర్చకు దారితీసింది. మరోవైపు వెలుగులోకి రాని అక్రమ రిజిస్ట్రేషన్లు ఎన్నో ఉన్నాయని.. వాటిని బయటకు వెలికితీయాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

### అధికారుల సహకారం..


నకిలీ ప్రతాలతో రిజిస్ట్రేషన్లు జరుగుతుండడం వెనుక సబ్ రిజిస్ట్రార్ల పాత్ర ఉందనే ప్రచారం ఉంది. దొడ్డి దారిలో డబ్బులు సంపాదించేందుకు అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పలువురు డాక్యుమెంట్ రైటర్లను తమ గుప్పిట్లో ఉంచుకుని అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారు. కనీసం ఈసీని కూడా పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. జిల్లాలో అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారాలు తరచుగా వెలుగు చూస్తున్నా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు తాత్సారం వహిస్తున్నారు. గతంలో రిజిస్ట్రేషన్ల శాఖలో ఏసీబీ దాడులు జరిగినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ల తీరు మారకపోవడం గమనార్హం.



## ఇందల్వాయి అభివృద్ధికి ప్రత్యేక చొరవ

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ఇందల్వాయి గ్రామాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. ఇందల్వాయి గ్రామ అభివృద్ధి కోసం ఎస్డీఎఫ్ నిధుల కింద రూ.23 లక్షల విలువైన ప్రొసీడింగ్ పత్రాలను కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్ నేతృత్వంలో సర్పంచ్ లోకాని గంగామణి గంగాధర్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఇందల్వాయి గ్రామాభివృద్ధికి ఇప్పటికే రూ.లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో మరిన్ని అర్హులకు ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్డీఎఫ్ నిధుల కింద ముదిరాజ్ సంఘం అభివృద్ధికి రూ.5 లక్షలు, కుమ్మరి సంఘానికి రూ.5 లక్షలు, ఇందల్వాయి రామాలయం ప్రాంగణంలో కాంపౌండ్ వాల్, ఫ్లోరింగ్ నిర్మాణానికి రూ.10 లక్షలు, శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.3లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు, ముదిరాజ్, కుమ్మరి సంఘం నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మూడు వారాల్లో 559 డ్రంకన్ డ్రైవ్ కేసులు: సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే భారీగా జరిమానాలు, జైలుశిక్షలు వేస్తున్నప్పటికీ మందుబాబుల్లో మార్పు రావట్లేదు. మద్యం తాగి దర్జాగా రోడ్లపై వాహనాలతో తిరుగుతున్నారు. పోలీసులు సైతం ప్రధాన కూడళ్లలో తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన 3 వారాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ 559 కేసులు నమోదు చేసినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. రూ. 52,80,000 జరిమానాల రూపంలో వసూలు చేశామని, 31 మందికి న్యాయస్థానాలు వారం రోజులు జైలు శిక్షలు విధించాయని కమిషనర్ తెలిపారు. నిజామాబాద్, బోధన్, అర్మూర్ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో మూడు వారాల పాటు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి రోడ్లపైకి వస్తే మొదటిసారిగా జరిమానా విధిస్తారని.. మరోసారి సైతం పోలీసులకు పట్టుబడితే తప్పనిసరిగా జైలుశిక్ష విధించబడుతుందని సీపీ వివరించారు. కాబట్టి ప్రజలు మద్యం సేవించి రోడ్లపైకి రావొద్దని.. తద్వారా ప్రమాదాలకు కారణం కావొద్దని ఆయన హెచ్చరించారు.

## విద్యార్థులను రెచ్చగొట్టేలా మాట్లాడితే సహించేది లేదు..: నగేష్‌రెడ్డి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విద్యార్థులను రెచ్చగొట్టేలా మాట్లాడితే సహించేది లేదని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి అన్నారు. ఈ మేరకు నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు గురువారం జరిగిన 'విద్యార్థుల రణభేరి'లో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడారన్నారు. ప్రజలు మీ చేష్టలను గమనిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను దిగమింగుకుని రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నప్పటికీ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డిదేనన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో 65వేల నుంచి 70వేల వరకు ఉద్యోగాలు కల్పించామన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా అందిస్తున్నామన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ 5 లక్షల నుండి 10లక్షల వరకు పెంచామని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు బీజేపీ వాళ్లకు కంటికి కనిపించట్లేదా అని నగేష్ రెడ్డి ప్రశ్నించారు. అదేవిధంగా సీఎం క్రీడల పట్ల ఎంతో ఆసక్తి ఉందని విద్యార్థులకు క్రీడలను ప్రోత్సహించే విధంగా కృషి చేస్తుంటే అభినందించాల్సింది పోయి పసలేని విమర్శలు చేస్తున్నారన్నారు.

## ఇందూరును ఎడారిగా మార్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు



**అక్షరటుడే, ఇందూరు:** ఇందూరును 18 ఏళ్లుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఎడారిగా మార్చాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలోనే పెద్దదైన శ్రీరాం సాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులు గత బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. అంతకు ముందు ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రాజెక్టులకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ప్యాకేజీ-21లో భాగంగా బినోల నుంచి సారంగాపూర్ వరకు రూ.900 కోట్లతో అండర్ గ్రౌండ్ పంపింగ్ వ్యవస్థను నిర్మించారని.. సారంగాపూర్ వరకు పంపులను ట్రయల్ రన్ చేసినప్పటికీ నిరుపయోగంగా మారాయన్నారు. ఎస్సారెస్పీలో నీరు అధికంగా ఉన్నప్పుడు సరైన నిర్వహణ లేక పంపులు మునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. సారంగాపూర్ నుంచి కొండెం చెరువు వరకు 9 కి.మీ మేర సుమారు రూ.1,200 కోట్లతో పనులు చేపట్టారని.. సారంగాపూర్ నుండి గుత్ప, అలీసాగర్ పరిధిలోని 47 వేల ఎకరాలకు నీరందించాలంటే 1,0000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉంటుందని దినేష్ తెలిపారు. కానీ కెనాల్ సామర్థ్యం సరిపోక ఆ నీరు వంతెనను తాకుతోందన్నారు. 18 ఏళ్లుగా ఈ కాల్వల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. సారంగాపూర్ నుండి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని మోపాల్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, జక్రాన్‌పల్లి, సిరికొండ ప్రాంతాల్లోని లక్ష ఎకరాలకు సాగునీరు పైపుల ద్వారా గాని కెనాల్ ద్వారా గాని అందించాలంటే సుమారు 10 టీఎంసీల నీరు అవసరం ఉంటుందన్నారు. అయితే కెనాల్ ద్వారా 47 వేల ఎకరాలకు నీరు అందించడానికి కూడా కెనాల్ సామర్థ్యం సరిపోవడం లేదని ఆయన వివరించారు. కాబట్టి, కెనాల్‌ను వెడల్పు చేస్తేనే లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం దోచుకునేందుకే రూ.18,000 కోట్లతో కొండెం చెరువు కింది నుండి పైపులైన్ పనులు చేపట్టిందని దినేష్ ఆరోపించారు. కార్యక్రమంలో గద్దె భూమన్న, నక్క రాజేశ్వర్, ఓం సింగ్, అనంత్ రెడ్డి, కర్క గంగారెడ్డి, చింత శ్రీనివాస్ రెడ్డి, నరేష్, శంకర్ రెడ్డి, శశాంక్, జగన్ రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.



## డ్రెయినేజీ నిర్మాణ పనులకు భూమిపూజ

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణ పరిధిలోని 7వ వార్డు మోడల్ స్కూల్ సమీపంలో డ్రెయినేజీ నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డులో పారిశుధ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఈ డ్రెయినేజీ పనులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనర్ శ్రీహరి రాజు, వార్డు కౌన్సిలర్ ఖాందేశ్ ప్రశాంత్, సానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి పాల్గొన్నారు.

## బీజేపీ 'ఇందూరు రణభేరి' కార్యక్రమం అట్టర్‌ఫ్లాప్ షో..: బొబ్బిలి రామకృష్ణ




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బీజేపీ 'ఇందూరు రణభేరి' కార్యక్రమం అట్టర్‌ఫ్లాప్ షోగా నిలిచిందని కాంగ్రెస్ నిజామాబాద్ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎంపీ అర్వింద్ నిర్వహించిన 'రణభేరి' కార్యక్రమం ఒక అట్టర్ ఫ్లాప్ షోగా నిలిచిందన్నారు. అది విద్యార్థుల కోసం పెట్టిన రణభేరి కాదని.. కేవలం ఆయన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఆడిన డ్రామా అని విమర్శించారు. రణభేరి వేదికగా ఆయన మాట్లాడిన మాటలు, చేసిన ఆరోపణలు పూర్తిగా హాస్యాస్పదమన్నారు. గత ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసి ఇచ్చి పసుపు బోర్డు తెస్తానని రైతులను అర్వింద్ మోసం చేశాడన్నారు. ఇప్పటివరకు జిల్లాలో బోర్డు ఏర్పాటైనప్పటికీ పూర్తిస్థాయిలో నిజామాబాద్ పసుపు రైతులకు న్యాయం మాత్రం జరగడం లేదన్నారు. బోర్డు పేరుతో కాలయాపన చేయడం తప్ప.. రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో ఎంపీ పూర్తిగా విఫలమయ్యారన్నారు. రైతుల కష్టాల గురించి మాట్లాడే అర్హత మీకు లేదని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీగా అర్వింద్ తెచ్చిన నిధులెన్నో స్పష్టం చేయాలని రామకృష్ణ సవాల్ విసిరారు. కేంద్రం నుంచి జిల్లాకు సాధించిన ప్రత్యేక నిధులు లేదా ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయా చెప్పాలన్నారు. స్థానిక సమస్యలను గాలికొదిలేసి, కేవలం ప్రతిపక్షాలపై, స్థానిక నాయకులపై వ్యక్తిగత దూషణలు చేయడమే మీ రణభేరి ముఖ్య ఉద్దేశమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, డీసీసీ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు విజయపాల్ రెడ్డి, సయ్యద్ సలీం, జెండా గుడి ఛైర్మన్ లవంగ ప్రమోద్, నగర యూత్ అధ్యక్షుడు మెయిన్, అధికార ప్రతినిధి గోవర్ధన్, కార్యదర్శులు హర్షద్,వహీద్, ఆకుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 20న 'ప్రజావాణి' రద్దు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు వేయడం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. కీలక అంశాలపై ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం ఉండడంతో ఈనెల 20న జరగాల్సిన ప్రజావాణిని రద్దు చేశామన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి తిరిగి ఎప్పటిలాగే ప్రతి సోమవారం ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు.

## ఇందూరు వైద్యుడికి అరుదైన గౌరవం..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల మానసిక వైద్య విభాగం ప్రొఫెసర్, విభాగాధిపతి, ఐఎంఏ నిజామాబాద్ అధ్యక్షుడు డాక్టర్ విశాల్ ఆకులకు అరుదైన గౌరవం దక్కింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యాలయం ప్రతిష్ఠాత్మకంగా ప్రదానం చేసే 'డాక్టర్ కేతన్ దేశాయ్ - ఆవో గావ్ చలేన్ అవార్డు (గ్రామీణ వైద్య సేవలు) అవార్డును విశాల్‌కు అందజేసింది. న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన జాతీయ వైద్యుల దినోత్సవ అవార్డుల కార్యక్రమంలో దేశ రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా విశాల్ అవార్డును అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు, మానసిక ఆరోగ్య అవగాహన, వ్యసన విముక్తి కార్యక్రమాలు, వైద్య విద్య, సామాజిక సేవలలో విశిష్ట సేవలను గుర్తించి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఈ జాతీయ పురస్కారానికి డాక్టర్ విశాల్ ఆకులను ఎంపిక చేసింది.

## క్రీడలతో మానసికోల్లాసం..



**అక్షరటుడే, ఆర్మూర్:** క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. విజయ్ హైస్కూల్‌లో ఘనంగా ఇంట్రాముర‌ల్ గేమ్స్, స్పోర్ట్స్‌డేను శనివారం నిర్వహించారు. ఈ క్రీడల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల మార్చ్ ఫస్ట్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన జెండాను ఆవిష్కరించి క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మమేకమై సరదాగా వాలీబాల్ ఆడి క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కవిత దివాకర్, హెడ్‌మాస్టర్ జి.రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సోనం వాంగ్‌చుక్‌కు మద్దతుగా నందిపేట్‌లో ర్యాలీ



**అక్షరటుడే, నందిపేట్:** ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్‌కు మద్దతుగా నందిపేట్ మండల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం భారీర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యాసంస్థల విద్యార్థులు యువకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జేఏసీ కన్వీనర్ గంగాధర్ మాట్లాడుతూ.. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద సోనం వాంగ్ చుక్ కొనసాగిస్తున్న నిరాహార దీక్షకు కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారన్నారు. లడఖ్‌లో విద్యారంగంలో అనేక మార్పులు తీసుకురావడమే కాకుండా 'ఐస్ స్తూప' వంటి వినూత్న ఆవిష్కరణల ద్వారా నీటి సమస్య పరిష్కారానికి ఆయన మార్గం చూపారని గుర్తుచేశారు. రామన్ మేగసేసే అవార్డుతో సహా పలు అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న ఆయన నిరాహార దీక్ష చేస్తుంటే కేంద్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జేఏసీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గంగాధర్, సర్పంచ్ ఎర్రం సిలిండర్ లింగం, ముస్లిం మైనారిటీ మండల అధ్యక్షుడు శౌకతుల్ బారీ, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


## ఎస్ఐఆర్ ఫారాలను బీఎల్‌వోలకు తప్పనిసరిగా అందజేయాలి



**అక్షరటుడే, కోటగిరి :** ఎస్ఐఆర్ ఫారాలను బీఎల్‌వోలకు తిరిగి అందజేసి ప్రజలను తమను ఓటుహక్కును కాపాడుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పోతంగల్‌లో ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నాయకులతో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సర్ నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. గడువు వచ్చేనెల 3 వరకు పొడిగించినప్పటికీ ఫారాలను త్వరగా బీఎల్‌వోలకు అందిస్తే డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఎక్కువగా ఉందన్నారు. వర్షాలు ఆశించిన రీతిలో పడట్లేదు కాబట్టి రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని యెండల సూచించారు. జొన్నలు, శనగలు, నువ్వులు తదితర పంటలు సాగు చేయాలన్నారు. అనవసరంగా ఖర్చులు పెంచుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దని ఆయన సూచించారు. నీటి కరువును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కల్లూరి హన్మాండ్లు (బజరంగ్), ఓమన పటేల్, సంతోషం పటేల్, మక్కయ్య, శంకర్, విజయ్, నాగయ్య, నహీముద్దీన్, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థినులపై లైంగిక వేధింపులు.. ఇద్దరు ఒప్పంద ఉపాధ్యాయుల తొలగింపు

**అక్షరటుడే, బాన్సువాడ:** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత స్థాయికి చేర్చాల్సిన కొందరు ఉపాధ్యాయులే దారి తప్పుతున్నారు. విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనల కారణంగా తల్లిదండ్రుల్లో ఆందోళన ఏర్పడుతోంది. తాజాగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని ఓ ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఒప్పంద ఉపాధ్యాయులపై వచ్చిన ఫిర్యాదులు కలకలం రేపాయి. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న గోపాల్, పవన్ అనే ఇద్దరు ఒప్పంద ఉపాధ్యాయులు విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని విద్యార్థినులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో విద్యార్థినుల ఆరోపణలు నిజమేనని తేలడంతో వారిద్దరిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించినట్లు జిల్లా విద్యాధికారి మల్లికార్జున్ తెలిపారు. అలాగే విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు కేసు నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు సమాచారం. విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు పేర్కొన్నారు.




## డ్రాపౌట్స్‌కు దగ్గరవుతున్న

# దూరవిద్య..

- అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో పెరుగుతున్న ప్రవేశాలు
- ఆసక్తి చూపుతున్న ఉద్యోగులు, యువత
- ఇంట్లోనే చదువుతూ డిగ్రీలు సాధిస్తున్న వైనం

**ఒకప్పుడు చదువు కోసం ఊరు వదిలి పోవాల్సి వచ్చేది. ఈరోజు టెక్నాలజీ వల్ల తరగతి గది మన ఇంటికే వచ్చింది. దూర విద్య ద్వారా పల్లెల్లోని విద్యార్థులు కూడా దేశంలోని టాప్ యూనివర్సిటీలతో సంబంధాలు పెంచుకుంటున్నారు. తద్వారా ఇంట్లోనే చదువుకుంటూ పట్టాలు సాధిస్తున్నారు.**

**- అక్షరటుడే, ఎల్లారెడ్డి**

ఉద్యోగం చేస్తూనే, ఇంటి బాధ్యతలు చూసుకుంటూనే డిగ్రీలు, కోర్సులు పూర్తి చేస్తున్నారు. అలాంటి దూరవిద్యలో చేరేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుంది. ప్రవేశాలు పొందేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకొని దూరమైన విద్యను దగ్గర చేసుకునేందుకు మార్గం సుగమం చేసుకుంటున్నారు అభ్యర్థులు. ఆర్థిక ఇబ్బందులు, తదితర కారణాల వల్ల ఉన్నత చదువుకు దూరమైన విద్యార్థులకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వరంగా మారింది.

### అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ..

ప్రభుత్వం ఉద్యోగాలకు అర్హతగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా పూర్తి చేసిన డిగ్రీని రెగ్యులర్ డిగ్రీతో సమానంగా గుర్తిస్తోంది. దీంతో చదువు మధ్యలో ఆపిన వారికి, ఉద్యోగం చేస్తూనే చదువుకోవాలనుకునే వారికి మంచి అవకాశం లభించింది. ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాల వల్ల కొందరు ఉన్నత చదువులకు దూరం అవుతుంటారు. మరి కొందరు రెగ్యులర్ తరగతులకు వెళ్లలేక ఊరు కుంటుంటారు. అలా మధ్యలో ఆపేసిన వారికి చదువుకోవడానికి ప్రభుత్వం చక్కటి అవకాశం కల్పిస్తోంది. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడిన వారు ఎంతోమంది ఉన్నారు. ఈ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు రెగ్యులర్ డిగ్రీ పూర్తి చేసిన వారితో సమానం. ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

### ఉమ్మడి జిల్లాల్లో తొమ్మిది కేంద్రాలు..

నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, మోర్తాడ్, భీమ్‌గల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దూరవిద్య సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బోధిస్తున్నారు. ఇంటర్ సమాన విద్యార్హతలు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ప్రస్తుతం టీవీ, డీటీవీ, డీఎస్సీ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. నచ్చిన కోర్సులు ఎంచుకొని డిగ్రీ పూర్తి చేయవచ్చు. ఆసక్తి ఉన్న పలువురు ఈ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఆర్థిక ఇబ్బందులున్న విద్యను మరింత చేరువ చేసేలా ప్రభుత్వం నెలకు ఐదు తరగతులు అంటే ప్రతి ఆదివారం పాటు రెండో శనివారం తరగతులు నిర్వహిస్తోంది.

### జత చేయాల్సి పత్రాలివే..

పది, ఇంటర్, తదితర మార్కుల జాబితా, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, విద్యార్థి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, మొబైల్ నంబర్ ఉంటే వర్సిటీలో దరఖాస్తు చేసుకోవచ్చు. 2026-2027 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ఫీజు ఎంట్రీ రుసుం రూ.3,400 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. పుస్తక ఫీజు ప్రతి సెమిస్టర్‌కు అవసరమైతే చెల్లించాలి. దరఖాస్తుకు జత చేసిన పత్రాలను సెంటర్‌లో ఇవ్వాలి. బుక్స్ కోసం రూ.500 డిపాజిట్ ద్వారా ఇంటికి వస్తుంది. వచ్చేనెల ఆగస్టు 7 తేదీ వరకు అవకాశం ఉంది. వివరాలకు హెల్ప్ లైన్ నంబర్ 73829 29570, 040 23680 222ను సంప్రదించాలి.

### రెగ్యులర్ డిగ్రీతో సమానం..

చదువు మధ్యలో ఆపిన వారికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వరం లాంటిది. మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చు. ఓపెన్ డిగ్రీ రెగ్యులర్ డిగ్రీతో సమానం. అటు కేంద్రంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలు రాయడానికి అర్హులు.

**– రజిత, అంబేద్కర్ సెంటర్ కో–ఆర్డినేటర్, నిజామాబాద్**

## ఎస్సారెస్పీ పరిసరాలను కాపాడండి.. వన్యప్రాణులను సంరక్షించాలి



**అక్షరటుడే, డొంకేశ్వర్:** ఎస్సారెస్పీ అందాలను వీక్షించేందుకు వస్తున్న పర్యాటకులు.. అక్కడి పరిసరాలను అపరిశుభ్రం చేయవద్దని ఎస్సారెస్పీ రేంజ్ ఆఫీసర్ రాజేందర్ పేర్కొన్నారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, స్థానిక ప్రజలతో కలిసి ఆయన శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెత్తను ఏరివేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులు తీసుకొచ్చిన ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ కవర్లు, పేపర్ ప్లేట్లు, వాటర్ బాటిళ్లు, ఇతర వ్యర్థ్యాలను అక్కడే వదిలి వెళ్లవద్దన్నారు. వాటిని అలాగే తీసుకెళ్లి చెత్తబుట్టలో పడేయాలని సూచించారు. అదేవిధంగా ఇటీవల కొంతమంది సందర్శకులు మద్యం సేవించి గాజు సీసాలు అక్కడే పడేస్తున్నారని.. వాటికారణంగా అడవి జంతువులకు, పశువులకు అలాగే పర్యటకులకు సైతం గాయాలయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.



## బేకరీలో చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** బేకరీలో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కామారెడ్డి రూరల్ సీఐ వివరాలు వెల్లడించారు. క్యాసంపల్లి గ్రామానికి చెందిన తేలు రమేష్‌కు చెందిన బేకరీ షాపును ఈ నెల 11న రాత్రి మూసివేయగా.. మరుసటి రోజు ఉదయం షట్టర్ తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. కౌంటర్లోని రూ.4వేల నగదు, సిగరెట్ ప్యాకెట్లు, టీ ఫ్లాస్క్, సౌండ్ బాక్స్, నిత్యావసర వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో సీఐ శ్రీధర్, ఎస్‌హెచ్‌వో రంజిత్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టాయి. శుక్రవారం టేక్రియాల్ జంక్షన్ వద్ద వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న బీబీపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన తంగళ్లపల్లి కనకరాజును అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ శ్రీధర్ వెల్లడించారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలంలోని గుత్ప గ్రామానికి చెందిన యగ్నేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో శనివారం ఆయన కుటుంబానికి మున్నూరు కాపు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో శశికుమార్, అనిల్, త్రినేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



## సర్కారు బడికి అడ్రస్ ఏదీ..?

**గాంధారి మండలంలోని గుర్జల్ గ్రామంలో ఎంపీపీయూపీఎస్ పాఠశాల ఉంది. అయితే విశాలమైన స్థలంలో ఉన్న స్కూల్‌కు అధికారులు పేరు రాయించడం మరిచిపోయారు. ఎంత ప్రభుత్వ పాఠశాల అయితే మాత్రం కనీసం స్కూల్‌కు పేరు కూడా రాయించరా అంటూ గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. – అక్షరటుడే, గాంధారి**



## వర్షాలు కురవాలని దేవుళ్లకు జలాభిషేకం

**అక్షరటుడే, బాన్సువాడ:** వర్షాభావంతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో మండలంలోని పోచారంలో వరుణ దేవుడు, పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులకు సాగు పనుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ, గ్రామస్థులు సంప్రదాయ పద్ధతిలో వర్షాలు కురవాలని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతావత్ రమేష్, గ్రామ పెద్ద సాయిరెడ్డి, ఉప సర్పంచ్ షేక్ లతీఫ్, మాజీ సర్పంచ్ సాయిలు, సాయిరాం, సాయిలు, రాజాగౌడ్ పాల్గొన్నారు.



## యువ సంగ్రామ సదస్సుకు ఎల్లారెడ్డి బీఆర్ఎస్ నాయకులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తెలంగాణ యువకులకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్న తీరుకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏర్పాటు చేసిన యువ సంగ్రామ సదస్సుకు యువకులు తరలివెళ్లారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆధ్వర్యంలో ఆయన పిలుపు మేరకు ఎల్లారెడ్డి నుంచి యువకులు సభకు కదిలి వెళ్లారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ తెలంగాణకు మేలుచేసే పార్టీ తెలంగాణ భవిష్యత్‌ను మార్చిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. ఎల్లారెడ్డిలో జాజాలను తిరిగి గెలిపించుకుంటామని వారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు సతీష్, అట్కూరి బబ్లు, పడమటి దయాకర్, భారత్, అమీర్, సాయి, నాగరాజు, వై.సాయి, అనిల్, భూషణం, అన్నసాగర్ సాయి, తదితరులు పాల్గొన్నారు.




## ఆరుతడి పంటలు సాగు చేయాలి

**అక్షరటుడే, లింగంపేట:** మండలం సజ్జన్‌పల్లి గ్రామంలో శనివారం ఏఈవో సంతోష్ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వాతావరణంలో ఎల్‌నినో ప్రభావం భాగంగా ఉందన్నారు. రైతులు ఆరుతడి పంటలు మొక్కజొన్న, జొన్నలు, కందులు, పెసర్లు తదితరుల ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.